క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 31 కేసుల పరిష్కారం



స్పెషల్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: స్థానిక కోర్టు భవనాల్లో శనివారం జరిగిన స్పెషల్ లోక్ అదాలత్‌లో రూ.1.54 లక్షల విలువైన 31 మోటారు సైకిళ్ల ప్రమాదాల కేసులు పరిష్కారమయ్యాయి. అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి శైలజ పాల్గొన్నారు.

అర్చకుల వసతి గృహాలకు రూ.25 వేల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్య నాయకుడు కాశీ విశ్వేశ్వరరావు దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల వసతి గృహాల సముదాయానికి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, ఆర్యవైశ్య నాయకుడు వంకాయల కాశీ విశ్వేశ్వరరావు, నాగ వెంకట మహాలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతా దేవికి శనివారం ఆలయంలో అందజేశారు. వారిని చైర్‌పర్సన్ వీరీతాదేవి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు సంసాని అబ్బు, దూనబోయిన బుజ్జి, పట్టణ ఆర్య వైశ్య నాయకులు యెండూరి నాగేశ్వరరావు, కాళ్లకూరి నాగ భూషణం, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి




ఎంపీ చింతా అనురాధకు వినతి పత్రం అందజేస్తున్న శ్యాంప్రసాద్ తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీ చింతా అనురాధకు స్కూలు చైర్మన్ వడ్డి శ్యాంప్రసాద్ వినతి పత్రం అందజేశారు. తమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ సుమారు 600 మంది విద్యార్థులున్నారని ఎంపీకి తెలియజేశారు. పాఠశాలలోని డార్మెటరీలో మంచాలు, ఇన్వెర్టర్ సౌకర్యం, బాలికల టాయిలెట్స్ వద్ద ఇన్సులేటర్ మిషన్ల ఏర్పాటుకు ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నుంచి నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ఎంపీ చింతా అనురాధ సానుకూలంగా స్పందించారని శ్యాంప్రసాద్ తెలిపారు. ఆయన వెంట కమిటీ సభ్యులు వడ్డి సత్యనారాయణ, ఎంపీ సూర్యం, కాపూరి క్రాంతికిరణ్, చంటిబాబు తదితరులున్నారు.

నేడు యూడీసీ ఉద్యోగ పరీక్ష

యానాం: యానాంలో ఆదివారం జరగనున్న అప్పర్ డివిజినల్ క్లర్క్(యూడీసీ) ఉద్యోగ పరీక్ష కోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. పరీక్షకు 2,212 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మొత్తంగా ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరగనుంది. పరీక్ష కోసం 240 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అభ్యర్థులంతా పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని, 9.30 గంటల నుంచి పరీక్ష గదుల్లోకి వారిని అనుమతిస్తారని రీజినల్ కోఆర్డినేటర్, ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, బ్లాక్ పాయింట్ పెన్, ఆధార్, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్‌లైసెన్స్, పాస్‌బుక్, పాన్ తదితర ఏవైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించమన్నారు.

ప్రజా సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాసింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: విజయవాడలో ఆదివారం బి.రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న ఏపీ ప్రజాసింహగర్జన సభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ యాదవ సంఘాలకు తన సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

పోటెత్తిన గోదావరి



మురమళ్ల గౌతమీ గోదావరి వద్ద వరద ఉధృతి

ఐ.పోలవరం: గోదావరి వరద నీరు పోటెత్తుతుంది. ఐ.పోలవరం మండలం చుట్టూ గోదావరి రోజురోజుకూ పెరుగుతుండడంతో తీరప్రాంత లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నివసించే వారి ఇళ్లకు గోదావరి వరద నీరు తాకడంతో పునరావాస కేంద్రాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకొంటున్నారు. మండలంలోని కేశనకుర్రు పంచాయతీ పరిధి పొగాకులంక, పెదలంక, పొట్టిలంక, జాంబవానిపేట, కొమరగిరి, మురమళ్ల రాఘవేంద్ర వారధి సమీపంలో నివసిస్తున్నవారు వరద నీరు చేరడంతో ముంపుబారిన పడ్డారు. ధవళేశ్వరం నుంచి భారీగా వరద నీరు వదులుతుండడంతో రైతులు లంక ప్రాంతాల్లో చేతికి అందిన పంటను, పశువులను గట్టు మీదకు చేర్చుకుంటున్నారు. అన్నంపల్లి పాత అక్విడెక్టు, కొత్త అక్విడెక్టు వద్ద గోదావరి ఉరకలేస్తుంది. గుత్తినదీవి, జి.మూలపొలం రేవుల వద్ద అధికారులు, పోలీసులు పహారా ఏర్పాటుచేసి ఎటువంటి రాకపోకలు లేకుండా అడ్డుకట్ట వేశారు. మరో రెండు రోజుల్లో గోదావరి శాంతిస్తుందని రైతులు అంచనాలు వేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అల్లవరం: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన బోడసకుర్రు, గోడితిప్ప, రెబ్బనపల్లి

లోతట్టు ప్రాంతాలు నీట మునక

గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాంబశివప్రసాద్ అన్నారు. బోడసకుర్రులోని పుష్కరఘాట్‌ని శనివారం పరిశీలించారు. వరద పెరిగితే పల్లపు ప్రాంతాల వారిని తరలించాలని సూచించారు. గతేడాది అందరి సహకారంతో వరదని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఈ ఏడాది కూడా అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.



బోడసకుర్రు రేవులో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తెలు



బోరున విలపిస్తూనే తండ్రి మృతదేహాన్ని మోస్తున్న కూతుర్లు

యానాం: కూతురు పుట్టింది మొదలు నట్టింట మహాలక్ష్మి అడుగు పెట్టిందంటూ మురిసిపోతాడు నాన్న.. బుడిబుడి అడుగులు వేస్తుంటే సంబరపడిపోతాడు. బడికి వెళ్లి చక్కగా చదువుకుంటుంటే చదువుల తల్లి అంటూ మహదానందం పొందుతాడు. యుక్తవయసు వచ్చాక అత్తారింటికి పంపాలంటే కన్నీరుమున్నీరైపోతాడు. అలాంటి నాన్న చనిపోవడం ఏ కూతురికైనా దిగమింగుకోలేని దుఃఖాన్నే మిగులుస్తుంది. అంతటి వేదనలోనూ కొడుకు కంటే కూతుర్లేమీ తక్కువ కాదంటూ ఆరుగురు కుమార్తెలు తమ తండ్రికి తలకొరివి పెట్టారు. కన్నీరుమున్నీరవుతూనే శ్మశానవాటిక వరకూ పాడెను మోస్తూ దగ్గరుండి అంతిమ సంస్కారాలను జరిపించారు.

శ్మశానవాటిక వరకూ పాడె మోసి.. అంతిమ సంస్కారాలు నిర్వహించిన వైనం

వివరాల్లోకి వెళితే యానాం పట్టణ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రేవు బాబూరావు(76) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన బీహార్‌లో సింద్రీ ఎరువుల కర్మాగారంలో పనిచేసి ఉద్యోగ విరమణచేశారు. ఆయనకు ఆరుగురు కూతుర్లు శాంతి, పుష్పలత, సునీత, కోమలి, హేమకుమారి, కల్యాణి ఉన్నారు. కుమారులు లేరు. ఈ నేపథ్యంలో తమను పెంచి పెద్దచేసిన తండ్రికి తామే అంతిమ సంస్కారాలు చేయాలని కుమార్తెలు నిర్ణయించుకున్నారు. గుండెల నిండా బాధతో విలపిస్తూనే తమ తండ్రి పాడెను స్థానిక మెట్టకూరు హిందూ శ్మశాన వాటిక వద్దకు మోసుకొచ్చారు. ఆఖరి కూతురు కల్యాణి తండ్రికి తలకొరివిపెట్టడంతో మిగిలినవారు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కన్నతండ్రి రుణాన్ని, రక్త సంబంధపు విలువను నేటి తరానికి తెలియజేస్తున్నారని ఈ దృశ్యాన్ని చూసిన పలువురు ప్రశంసించారు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీ

ఐ.పోలవరం: మండలంలో ఐ.పోలవరంలో ఉన్న బీసీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాల్ని ముమ్మిడివరం లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి ఏర్పాట్లు, వంటశాల పరిసరాలతో పాటు రికార్డులను ఆయన పరిశీలించారు. బాలికల విద్య, ఆరోగ్యం విషయాల్లో శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులకు భోజనం వేడిగా వండి పెట్టాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



ఐ.పోలవరంలో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ముమ్మిడివరం సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా

ఆక్వా, చేపల రైతుల కార్యవర్గం ఎన్నిక

యానాం: యానాం ఆక్వా అండ్ ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఈలప్రోలు విష్ణువర్ధనరావు, అధ్యక్షుడిగా కొండమూరి భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా అనిశెట్టి నాగిరెడ్డి, కార్యదర్శిగా మెల్లం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కవల వీరభద్రరావు, కోశాధికారిగా కోరుకొండ రాజేంద్రప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాం ప్రాంతంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ నెల 25న పుదుచ్చేరి సీఎం, ఎల్జీని కలిసి విన్నవిస్తామన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఈ నెల 26న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురం పర్యటన సందర్భంగా స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో చేస్తున్న ఏర్పాట్లను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఆర్‌అండ్‌బీ, పురపాలక సంఘ ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. అమలాపురంలో పలు బ్రిడ్జిలు, రోడ్డు విస్తరణ, కొత్త వంతెనల అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. మంత్రి వెంట నాయకులు వంటెద్దు నాయుడు, చెల్లబోయిన శ్రీనివాస్ తదితరులున్నారు.

సన్నవిల్లిలో చోరీ

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి ఆభరణాలు దోచుకున్న సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వానపల్లి దుర్గారావు ఈ నెల 16న భార్యతో కలిసి రాజమండ్రి వెళ్లి 19న అమలాపురం అత్తవారింటి దగ్గర ఉండి, ఆదివారం ఉదయం సన్నవిల్లిలోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. తాళం తీసి లోపలికి వెళ్లేసరికి ఇంటి వెనక వైపు తలుపులు పగులగొట్టి బీరువా తలుపులు తీసి ఉండటం గమనించారు. 18 గ్రాముల బంగారం, 48 తులాల వెండి, ఒక స్మార్ట్ వాచ్ చోరీకి గురయ్యాయని గుర్తించి తమ ఇంట్లో దొంగలు పడ్డారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురం రూరల్: స్థానిక బుద్ధవిహార్‌లో శనివారం జరిగిన ఆర్టీసీ జిల్లా సర్వసభ్య సమావేశంలో అమలాపురం డిపో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డీపీ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీఎస్ నారాయణతో పాటు కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ బుజ్జి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాజు, అనకాపల్లి డిపో అధ్యక్షుడు రావు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కుమార్, అమలాపురం డిపో సెక్రటరీ దొరబాబు తదితరులు అభినందించారు.



ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ జిల్లా నూతన కార్యవర్గం

26న పేరూరు-గోడిలంక రోడ్డుకు శంకుస్థాపన



ఎంపీ అనురాధ

అల్లవరం: ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులు రూ.25 కోట్లతో పేరూరు, గోడిలంక, బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని అమలాపురం ఎంపీ చింతా అనురాధ శనివారం తెలిపారు. ఈ నెల 26న అమలాపురంలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా సున్నా వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ అనంతరం శంకుస్థాపన నిర్వహిస్తారన్నారు.

కొబ్బరి చెట్ల నరికివేత

తాళ్లరేవు: ఎటువంటి సమాచారం లేకుండా తన పొలంలోని కొబ్బరిచెట్లను విచక్షణా రహితంగా నరికేశారంటూ పోశింశెట్టి రామకృష్ణ అనే రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.మల్లవరం గ్రామ పరిధిలో విద్యుత్ లైను వేసేందుకు గానూ అడ్డుగా ఉన్న కొబ్బరిచెట్లను సిబ్బంది నరికేశారు. దీంతో ముందస్తు సమాచారం లేకుండా తన సొంత పొలంలో చెట్లను ఎలా నరికేస్తారంటూ రైతు రామకృష్ణ అధికారులను ప్రశ్నించాడు. దీనిపై ప్రశ్నిస్తే పంచాయతీ వాళ్లని అడగమని విద్యుత్ సిబ్బంది, విద్యుత్ అధికారులను అడగమని పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, లేకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.



పి.మల్లవరంలో నరికి వేసిన కొబ్బరి చెట్లు

యానాం మున్సిపల్ కమిషనర్‌గా ప్రగాశం

యానాం: యానాం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా పుదుచ్చేరికి చెందిన పీసీఎస్ అధికారి అరుల్ ప్రగాశంను నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ శనివారం ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకూ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న గోయల్ ఐఏఎస్‌కు ఎంపికకావడంతో ఆయన స్థానంలో నూతన కమిషనర్‌ను నియమించారు. అదేవిధంగా పుదుచ్చేరి వ్యాప్తంగా 15 మందిని వివిధ శాఖల్లో అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సమస్యల పరిష్కారానికే
జగనన్న సురక్ష



కొత్తగా పెళ్లయిన దంపతులకు మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



కోరంగిలో మహిళకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్ సాగర్ తదితరులు

అల్లవరం: సాంకేతిక కారణాలతో ఎదురైన సమస్యల పరిష్కారించి అందరికీ ప్రభుత్వ పథకాలను దరి చేర్చడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన బోడసకుర్రు పంచాయతీ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు జగనన్న సురక్ష సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీటీసీలు దొమ్మేటి శ్రీశాంతి భవాని, బస్వాని పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్టపర్తి షణ్ముఖరావు, అంబటి శ్రీను, దొమ్మేటి సురేష్, అడపా శ్రీను, సాపే ధర్మరాజు, జల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ప్రజా సమస్యలు పరిష్కరించి, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. మండలంలో శనివారం ఎదుర్లంక గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ముదునూరి పద్మావతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమ సభ జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ముదునూరి అర్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సచివాలయం-2 వద్ద శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ 508 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి రామరాజు, కొపనాతి నాగరాజు, పెయ్యల శ్రీనివాస్, కామాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు సత్కారం



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగ సంఘం ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు అధిక పెన్షన్ రాబోతుందని తెలియజేసిన మంత్రి విశ్వరూప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసినవారిలో సంఘం నాయకులు సూదా గణపతి, దొమ్మేటి రాధాకృష్ణ, యర్రంశెట్టి ధర్మారావు, మట్టపర్తి ఈశ్వరరావు తదితరులున్నారు.

మహిళలకు ఉపాధి కల్పనే ధ్యేయం

అమలాపురం రూరల్: పేద, మధ్యతరగతి నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించాలన్నదే స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ధ్యేయమని ఆ సంస్థ అధ్యక్షురాలు స్వర్ణలత అన్నారు. శనివారం స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వన్నెచింతలపూడి గ్రామంలో 100 కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు సగం ధరకే కుట్టు మిషన్లను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా రాజారత్నం, సీఆర్పీఎఫ్ ఇండియా అధినేత గుడివాడ పాల్‌ప్రసాద్, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గుత్తాల జ్యోతిబాబు, ఏడిద వేణు బాబు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన కుట్టు మిషన్లతో మహిళలు

పిల్లంకలో సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి భారీ గజమాల వేస్తున్న నాయకులు

తాళ్లరేవు: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ హోదాలో తొలిసారిగా తాళ్లరేవు మండలం పిల్లంక విచ్చేసిన వైవీ సుబ్బారెడ్డికి స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఏలూరు, భీమవరం జిల్లాల ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జ్ చింతలపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సుబ్బారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత పిల్లంక మాజీ సర్పంచ్ సాగి భీమేశ్వరరాజు, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు సుబ్బారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారీ గజమాలతో సుబ్బారెడ్డిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే పొన్నాడ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. 2019లో మాదిరిగానే 2024లో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లాడిని కలిసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లాడి కృష్ణారావును యానాంలోని ఆయన స్వగృహంలో తిరుమల తిరుపతి బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని మల్లాడి కృష్ణారావు దంపతులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ముమ్మిడివరం ఎమ్మెల్యే వైఎస్ఆర్‌సీపీ నేత చింతలపాటి శ్రీనురాజు తదితరులు సమావేశమై వివిధ విషయాలపై చర్చించారు.



టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న మల్లాడి దంపతులు

విత్తనాలు చల్లింది లేదు.. నారు మొలిచింది



నారుమడిని తలపిస్తున్న రైతు చేను

ఉప్పలగుప్తం: ఖరీఫ్ సాగులో రైతులు నిమగ్నమై చేలు దుక్కు దున్నటం, నారుమడులు వేయటం, నాట్లు నాటడం వంటి పనుల్లో పరుగులు పెడుతూ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. కానీ ఓ రైతు చేలో ఇవేమీ చేయకుండానే, కనీసం విత్తనం వెద జల్లకుండానే నారు మొలిచి ఆశ్చర్యపరిచింది. మండలంలోని వానపల్లిపాలెం గ్రామంలో రైతు రబీ కాలంలో పండిన వరి పంట ఒబ్బిడి చేసుకునే క్రమంలో చేనులో కొంత మేర ధాన్యం రాలింది. అనంతరం ఆ రైతు ఎండలు ఎక్కువగా కాసిన సమయంలో నేల సేద్యం కోసం దుక్కు దున్నించి భూమిని తిరగబెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమిలో విత్తనం మొలకలు వచ్చి నారుమడిని తలపిస్తుంది. రోడ్డును చెంతనే ఆకర్షణీయంగా ఉండటంతో పలువురు రహదారిపై వెళ్లేవారు వెదజల్లు చల్లారా, మెలకెత్తిందా అని ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ చిత్రం శనివారం సాక్షి కెమెరాకు చిక్కింది.